క్లుప్తంగా

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ


విశేష అలంకారంలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: హరిహర క్షేత్రంగా పేరొందిన అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం శని త్రయోదశి, శనివారం కలసి రావడంతో భక్తులు తెల్లవారుజాము నాలుగు గంటలకే ఆలయానికి విచ్చేసి స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొనసాగింది. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఉదయాన్నే స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులకు దాతల సహకారంతో పులిహోర, చక్రపొంగలి, దద్దోజనం పంపిణీ చేస్తున్నామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ చెప్పారు. అలాగే ప్రతి శనివారం దేవస్థానం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. అంతేకాకుండా భక్తుల నుంచి అన్నదానం కోసం విరాళాలు సేకరిస్తున్నామని వివరించారు.

'అపుస్మా' కొవ్వూరు జోన్ నూతన కార్యవర్గం ఎన్నిక

తాళ్లపూడి: ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు అందరూ ఐక్యంగా ఉండి అపుస్మా ను బలోపేతం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్ రెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) కొవ్వూరు జోన్ నూతన కార్యవర్గాన్ని శనివారం తాళ్లపూడిలోని మాంటిస్సోరి హైస్కూల్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొవ్వూరు జోన్ అధ్యక్షుడిగా తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ వీవీ అవినాష్‌ను ఎన్నుకున్నారు. జోన్ సెక్రటరీగా కొవ్వూరు సద్గురు హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం, కోశాధికారిగా చాగల్లు సెయింట్ లూయిస్ స్కూల్ కరస్పాండెంట్ ఎన్.తిమోతి ఎస్ బాబులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఈసీ మెంబర్లు ఎం.రవిచంద్ర, పి.గంగాధరరావు, జిల్లా ప్రధానకార్యదర్శి పి.శివాజీ, జిల్లా కోశాధికారి పి సురేష్, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ప్రసాద్‌రెడ్డి సేవలు అభినందనీయం


గోపాలపురంలో ప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న మానవత సంస్థ సభ్యులు

గోపాలపురం: మానవత సంస్థ మండల శాఖ మాజీ అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్ రెడ్డి సేవలు అభినందనీయమని ఆ సంస్థ మండల శాఖకు కొత్తగా ఎన్నికైన పి.సత్యకృష్ణారెడ్డి కొనియాడారు. గోపాలపురం రామాలయం వద్ద శనివారం మాజీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ గతేడాది మానవత సంస్థ సభ్యత్వాలు, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సంస్థ మండల శాఖకు కృపావరప్రసాద్‌రెడ్డి తగిన గుర్తింపు తీసుకు వచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు గుబ్బా లక్ష్మణరావు, నెల్లి చంద్రశేఖర్, కె.కీర్తికుమార్ మానవత సంస్థ మండలశాఖ సభ్యులు పాల్గొన్నారు.

దాత సాయంతో ఆర్వో ప్లాంట్ ప్రారంభం


ముత్యాలవారిపాలెంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడం ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇది సాకారం అవుతుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ముక్కామల గ్రామశివారు ముత్యాలవారిపాలెంలో శానం సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పైప్‌లైన్ల విస్తరణ పనులు పూర్తయ్యాయన్నారు. వాటర్ ప్లాంట్‌లను కూడా త్వరితగతిన పూర్తిచేసి మంచి నీటి సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దాత శానం సత్యనారాయణ దంపతులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీనివాస్, జనసేన మండల శాఖ అధ్యక్షుడు పిప్పర రవి, టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మానవ మృగాలపై ఆగ్రహం

- కోల్‌కతాలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసన
- నిందితుల్ని తక్షణం అరెస్ట్ చేయాలని వైద్యులు, సిబ్బంది డిమాండ్
- డివిజన్ వ్యాప్తంగా నిరసన ర్యాలీలు
- ఐఎంఏ ఆధ్వర్యంలో 24 గంటల పాటు వైద్య సేవల బహిష్కరణ


కొవ్వూరులో నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన తెలుపుతున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది


నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్లు, సిబ్బంది నిరసన

కొవ్వూరు: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ వైద్య కళాశాల్లో ట్రైనీ వైద్యురాలిపై ఈ నెల 9న జరిగిన అత్యాచారం ఘటనకు నిరసనగా కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది భగ్గుమన్నారు. ఈ కేసులో నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ శనివారం వారంతా కొవ్వూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుంచి విజయ విహార్ సెంటర్ వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయికిరణ్ మాట్లాడుతూ ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఐఎంఏ పరిధిలో పనిచేసే అన్ని ప్రైవేట్ ఆసుపత్రులూ శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకూ వైద్య సేవలు నిలిపివేశాయన్నారు. అత్యవసర సేవలను మాత్రం మినహాయింపు ఇచ్చామన్నారు. హత్యకు గురైన ట్రైనీ వైద్యురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యులు రజనీ కుమారి, సత్యకుమారి, హెడ్ నర్సులు సీహెచ్ భాగ్యవతి, బి.బేబీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ నిరాజ్‌కుమార్, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ దుర్గాప్రసాద్, కౌన్సిలర్ ఎస్.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ నల్లజర్లలోని విమ్స్ ఆసుపత్రి వైద్యులు సేవలను నిలిపివేసి నిరసన తెలిపారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు 24 గంటల పాటు వైద్య సేవలు బంద్ చేశారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు ఆసుపత్రి ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అత్యవసరం మినహా వైద్య సేవలను నిలిపివేశారు. ఆదివారం ఉదయం 6 గంటల వరకూ వైద్యుల నిరసన కొనసాగుతుంది. అలాగే నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆసుపత్రి ప్రధాన వైద్యుడు తెల్లం గంగాధరరావు, డాక్టర్ సిరాజుద్దీన్, వైద్య ఉద్యోగుల సంఘ నాయకుడు జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: కోల్‌కతా వైద్య కళాశాల్లో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం ఘటనకు నిరసనగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు శనివారం సమ్మె చేశారు. తాళ్లపూడి, మలకపల్లి, అన్నదేవరపేట పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది శనివారం తాళ్లపూడిలో ప్ల కార్డులు చేత పట్టుకుని నిరసన ర్యాలీ చేశారు. అనంతరం తాళ్లపూడి తహసీల్దార్ రవీంద్రనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఐఎంఏ పిలుపు మేరకు నిర్వహించిన ఈ సమ్మెలో ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యులు కూడా నల్ల రిబ్బన్లు ధరించి వేరుగా నిరసన తెలిపారు. తాళ్లపూడి, అన్నదేవరపేట, మలకపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు హారికా గుప్తా, స్వర్ణలత, సుచందన, వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో..

చాగల్లు: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలంటూ బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారంతా మెయిన్ రోడ్‌పై మానవహారంతో ఏర్పడ్డారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశిత, డాక్టర్ దేవి మాట్లాడుతూ ఘటనకు కారకులైన వారిని అందరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో విధుల్లో ఉంటున్న మహిళా వైద్య సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వి.పద్మ, ఎస్. సారమ్మ, సీహెచ్ శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఉండ్రాజవరం పీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, యూడీసీ సత్యనారాయణ రెడ్డి, హెచ్‌వీ సుభాషిణి, ఫార్మసిస్ట్ శ్రీదేవి, హెల్త్ క్లస్టర్స్ ఇంఛార్జ్ కాపా నాగరాజు, సుబ్రహ్మణ్యం, సీతయ్య, రామకృష్ణ, విజయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై ఇటీవల జరిగిన అత్యాచారం ఘటనను ఖండిస్తూ గ్రామాల్లో వైద్యులు, సిబ్బంది నిరసన ప్రదర్శన చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం దేవరపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు నిరసన ప్రదర్శనలు చేశారు. స్థానిక సుమంత్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది గ్రామంలో నిరసన ప్రదర్శన చేశారు. అలాగే హాస్పిటల్ వద్ద కూడా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం జరుగుతుందన్నారు. అప్పటి వరకూ అత్యవసర కేసులకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం పీహెచ్‌సీల వద్ద వైద్యులు, సిబ్బంది శనివారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ డి. సాంబశివరావు, డాక్టర్ డి.సంజీవ్ కుమార్, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. గౌరీపట్నంలో డాక్టర్ జె.సతీష్, సీహెచ్‌ఓ చిన్నికృష్ణుడు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిడదవోలులో సీఐటీయూ ఆధ్వర్యంలో..


నిడదవోలు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

నిడదవోలు: కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం ఘటనను నిరసిస్తూ శనివారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉదయం 6 గంటల నుంచి వైద్య సేవలు బంద్ చేశారు. సీఐటీయూ, ఏపీ ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, ఏపీఎన్ హెచ్ఎం చైర్మన్ దయామణి మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి అన్ని విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వైద్య సేవలు అందించే మహిళా ఉద్యోగులకు రాను రానూ రక్షణ లేకుండా పోతోందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినపుడు కంటి తుడుపు చర్యలు చేపట్టడం, తర్వాత పూర్తిగా పట్టించుకోని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తూ కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ నర్స్ రాణి, ఆశ కార్యకర్తలు చిన్నారి, హేమలత, జ్యోతీదేవి, మణి, తదితరులు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది


చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో ర్యాలీ ..


ఉండ్రాజవరం పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలతో వైద్యులు, సిబ్బంది నిరసన


దేవరపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద వైద్యులు, సిబ్బంది నిరసన

నేడు గ్రామ దేవతలకు కిరీటాల అలంకరణ


గోపాలపురం గ్రామదేవతలు నక్కిర్లమ్మ, సోమాలమ్మ

గోపాలపురం: గోపాలపురం గ్రామ దేవతలు నక్కిర్లమ్మ, సోమాలమ్మ వార్లకు ఆదివారం మంగళ సూత్రధారణ, కిరీటధారణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక షిర్డీసాయి ఆలయం వద్ద నుంచి అమ్మవార్లను గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం గంగానమ్మ ఆలయం వద్ద అమ్మవార్లకు చీర సారెలతో అలకరణ అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉండ్రాజవరంలో హోమియో వైద్య శిబిరం


ఉండ్రాజవరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న హోమియో వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం: స్థానిక గ్రామ సచివాలయం వద్ద శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో పాలకొల్లుకు చెందిన శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ ఆధ్వర్యంలో 31 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా హోమియో మాత్రలు అందజేశారు.
హోమియోపతి వైద్య నిపుణులు కోసూరి రామకృష్ణంరాజు (డాక్టర్ పోడూరు రాజు) టెలికాలింగ్ ద్వారా రోగుల వ్యాధులను తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సైతం తగిన సలహాలు, ఇచ్చి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

19 నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ఉండ్రాజవరం: మండలంలోని పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకూ మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సర్పంచులకు, కార్యదర్శులకు శానిటేషన్, ఘన వ్యర్థాల కేంద్రాల నిర్వహణ, స్ట్రీట్ లైట్స్ నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు.

'మానవత' ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ


దేవరపల్లిలో మానవత సంస్థ శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్సై సుబ్రహ్మణ్యం


దూబచర్లలో మానవత సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం కోరారు. మానవత సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం దేవరపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఎస్సై సుబ్రహ్మణ్యం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ సేవలను పోలీసు శాఖ కూడా వినియోగించుకుంటుందన్నారు. మానవత సంస్థ మండల చైర్మన్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపనకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ , జూనియర్ కళాశాలల విద్యార్థులు కూడా శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం దేవరపల్లి మూడురోడ్ల కూడలిలో వారంతా మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు కె.రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు, పలువురు సభ్యులు, కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దూబచర్లలో..

నల్లజర్ల: ప్రపంచ శాంతి కోరుతూ మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం దూబచర్ల గ్రామంలో శాంతి ర్యాలీ జరిగింది. ఆ గ్రామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఎలైట్ విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు గ్రామవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, భోగవల్లి వెంకట సుబ్బారావు, కూచిపూడి ఉదయ భాస్కరావు, మండల శాఖ అధ్యక్షురాలు ఝాన్సీరాణి, ఎలైట్ ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి, దావులూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు రాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: మానవత సంస్థ నిడదవోలుశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్థానిక గణేష్ చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీసు స్టేషన్, మెయిన్ బజార్, గాంధీ బొమ్మసెంటర్, నంగాలమ్మ వారి గుడి, గణపతి సెంటర్ నుంచి పాటి మీద వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్య చంద్రరావు, కార్యదర్శి ముళ్ళపూడి సోమరాజు, కోశాధికారి పెనుగొండ వెంకట సుబ్బారావు, తన్నీడి బోసు, కాజ గంగరాజు, కుందుల ప్రభాకరం, ఉన్నమట్ల లీలాలక్ష్మి సత్యభాస్కర ప్రసాద్, బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నీలం రామారావు, ఏవీ రమణ, జి. కృష్ణారావు, నిప్పులేటి వెంకటరమణ, బేతిన ప్రసాద్, కాళ్ళ లక్ష్మణరావు, ప్రత్తిపాటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ నాగరాజు నాయక్

సాక్షి ఇంపాక్ట్


మునిపల్లిలో ఆక్రమించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీఓ శామ్యూల్

నిడదవోలు రూరల్: ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ హెచ్చరించారు. నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పూడ్చేయడంపై 'కళ్లెదుటే పూడ్చేస్తున్నా కనిపించదా?' అనే శీర్షికన ఈనెల 17న సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీఓ పి.శామ్యూల్ ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమించేందుకు ప్రయత్నించిన వ్యక్తుల పేర్లతో నివేదిక వెంటనే ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి మారుతీశ్వరరావు, వీఆర్వో వెంకటరత్నంలను ఆదేశించారు. ఇకపై గ్రామాల్లో ప్రభుత్వ స్థలల్లో ఆక్రమణలకు పాల్పడితే అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు

నిడదవోలు రూరల్: పాత గొడవల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. మండలంలోని కోరుమామిడికి చెందిన ఆరుగొల్లు సాయిబాబుపై ఈనెల 16న అదే గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు బాబూరావు కుటుంబ సభ్యులు దాడి చేశారు. దీంతో బాధితుడు సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

పేముల కాలువను కమ్మేసిన గుర్రపుడెక్క

- మురుగు పారుదలకు సమస్యలు
- తొలగించాలంటున్న రైతులు


నెలటూరు వంతెన వద్ద ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క

చాగల్లు: పేముల కాలువలో గుర్రపు డెక్కను పేరుకుపోయింది. తొలగించాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాలకు కాలువలోకి చేరిన వరదనీటి ప్రవాహానికి గుర్రపుడెక్క వలన ఆటంకం కలుగుతోంది. ఈ కారణంగా వర్షపు నీరు పొలాల్లోనే నిలిచిపోతుందని రైతులు వాపోతున్నారు. పేముల కాలువలో పూడిక తీత పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ పనుల గురించి ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. పలు గ్రామాల్లోని ఈ కాలువలో గుర్రపుడెక్క , తూడుకాడ విపరీతంగా పెరిగిపోయాయి. దాంతో ఏటా మురుగు, ముంపునీరు పోయే మార్గం లేక పంటలు మునిగిపోయే పరిస్థితి నెలకొందని రైతులు వివరిస్తున్నారు. చాగల్లు, చంద్రవరం, నెలటూరు, గౌరిపల్లి, మల్లవరం తదితర గ్రామాల్లో పేముల కాలువలో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయింది. వాటితో పాటు నందిగంపాడు, ఊనగట్ల, మార్కొండపాడు తదితర గ్రామాల్లోని పంట కాలువల్లోనూ గుర్రపుడెక్క పేరుకు పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల సమయంలో డ్రైన్లు పొంగి పొర్లుతాయి.

మహిళా డిగ్రీ కళాశాల్లో అడ్మిషన్లు ప్రారంభం

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లో రెండో విడత ఆన్‌లైన్ అడ్మిషన్లు ఈ నెల 22 నుంచి ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

బాలుర జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే


నృత్యాలు చేస్తున్న సీనియర్ విద్యార్థులు

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు సినీ గీతాలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత మాట్లాడుతూ ఇప్పటి నుంచీ విద్యార్థులందరూ చదువుపై దృష్టి సారించాలన్నారు. అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆమె ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలసి ప్రిన్సిపాల్ మేరీ సుజాతను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.హరీష్, జి.రామ్మోహన్‌రావు, బి.యేసురత్నం, వెంకటరమణ, సురేష్‌కుమార్, రాజ్ కుమార్ ,కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.